క్లుప్తంగా

పుట్టిన రోజు వేడుకలు



మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు జన్మదిన వేడుకలు శనివారం జరిగాయి. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు ఆయన కార్యాలయంలో శిరీష బాబూరావుతో కేక్ కట్ చేయించి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జన ఆరోగ్య సమితి కమిటీ సమావేశం

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ యుపిహెచ్‌సి వారు నూతనంగా ఏర్పాటు చేసిన జన ఆరోగ్య సమితి కమిటి మొదటి సమావేశం శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో జరిగింది. జన ఆరోగ్య సమితి కమిటీ చైర్‌పర్సన్, డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటి సెక్రటరీ డాక్టర్ మను పప్పన్, జన ఆరోగ్య సమితి సభ్యులు, యూపిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జీహెచ్‌యంసి పరిధిలోని వైద్య, విద్య, శానిటేషన్, ఎంటమాలజి వంటి వివిధ శాఖలలోని అధికారులను ఎన్నుకొని జన ఆరోగ్య సమితి కమిటి ఏర్పాటు చేశామన్నారు.

ఉచిత వైద్య శిబిరం



బాలానగర్: ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి సందర్శించారు. శనివారం ఫతేనగర్ డివిజన్‌లోని శివశంకర్‌నగర్ కమ్యూనిటీ హాలులో ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల విజయవంతమైన సుపరిపాల సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో అనేక ఆరోగ్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రేమ్‌కుమార్‌ను బీజేపీ పార్టీ తరపున అభినందిస్తున్నానని హరీష్ రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కృష్ణగౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఆకుల ఉదయ్‌కుమార్, బానేష్, గోపాల్, నరేష్, ప్రమోద్, శ్రీనివాస్, చంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గం చెరువులో ఫైర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

మాదాపూర్: వరదల్లో, నీటిలో పడ్డవారిని ఏ విధంగా రక్షించాలో ఇండియన్ రెస్క్యూ అకాడమీ బృందం ఫైర్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శనివారం మాదాపూర్‌లోని దుర్గం చెరువులో 65 మంది ఫైర్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వాటర్ రెస్క్యూ ఆపరేషన్ టీం డెమోను నిర్వహించారు. వరదలు, ముంపులు వచ్చినప్పుడు బోట్‌లపై వెళ్ళి ఏ విధంగా కాపాడాలో అవగాహన కల్పించారు. డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వెంకన్న మాట్లాడుతూ నాణ్యమైన శిక్షణ తీసుకున్నప్పుడే మంచిఫలితాలు వస్తాయని తెలిపారు. అనంతరం బోట్‌లపై వివిధ విన్యాసాలతో సందర్శకులను అలరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి, సందేష్, అడిషనల్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ గిరిధర్‌రెడ్డి, విజయ్‌కుమార్, రఫీ, క్రాంతి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్‌మోహన్, ఫాజల్ తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో

బోనాల వేడుకలు

కూకట్‌పల్లి: బోనాల పండుగ పురస్కరించుకొని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో శనివారం విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. తెలంగాణ పండుగ శోభను ప్రతిబింబిస్తూ పాఠశాలల ఆవరణను వేప, పూల తోరణాలతో అలంకరించారు. విద్యార్థులు పోతరాజులు, అమ్మవార్ల వేషధారణలో పలువురిని అలరించారు.



కూకట్‌పల్లిలోని అక్షర పాఠశాలలో..



గీతాంజలి స్కూలులో..



సాయి చైతన్య టెక్నో హైస్కూలు విద్యార్థులు



న్యూ ఎరా హైస్కూలులో..



.సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో..

నేడు చిత్తారమ్మ బోనాల ఉత్సవాలు

- భక్తుల కొంగుబంగారంగా విలసిల్లే శ్రీ చిత్తారమ్మ తల్లి ...
- బోనంతో మొక్కులు చెల్లించుకోనున్న మహిళా భక్తులు...
- కనువిందుగా పోతరాజుల విన్యాసాలు... శివసత్తులు నాట్యాలు



కూకట్‌పల్లిలోని శ్రీ చిత్తారమ్మ దేవాలయం, అమ్మవారు

ఆల్విన్ కాలనీ: కూకట్‌పల్లి ప్రజల ఇలవేల్పు శ్రీ చిత్తారమ్మ తల్లి బోనాల మహోత్సవ వేడుకలకు అమ్మవారి దేవాలయం సిద్ధమైంది. కోరిన కోర్కెలు తీర్చే భక్తుల పాలిట కొంగు బంగారంగా విలసిల్లే అమ్మవారిగా శ్రీ చిత్తారమ్మ తల్లి ప్రజల మదిలో కొలువు దీరింది. సుమారు వంద సంవత్సరాలకు పైగా భక్తుల నుంచి పూజలను అందుకుంటు, ప్రతి ఇంటి ఇష్ట దైవంగా పేరు పొందిన శ్రీ చిత్తారమ్మ అమ్మ వారు ఆలయ పరిసరాలను ఆలయ కమిటీ సభ్యులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసారు. జీహెచ్‌ఎంసి అధికారులు దేవాలయ ప్రాంగణం చుట్టూ మౌలిక వసతులను కల్పించారు. ఆదివారం ఉదయం 4 గంటల నుంచే అమ్మవారి పూజా వేడుకలు, బోనాల సంబరాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. అదే విధంగా వాహన పూజలు, పాట్టేళ్ల, తొట్టెల ఊరేగింపులు, డప్పు దరువులు, పోతరాజుల నృత్యాలు, శివసక్తుల వీరంగాలతో ఆ ప్రాంతం సందడి నెలకోనుంది. సాయంత్రం మూడు గంటల నుంచి సామూహిక బోనాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరారనున్నది. హైదరాబాద్‌లోనే ఈ చిత్తారమ్మ దేవాలయ మహోత్సవ వేడుకలు మహా జాతరగా భక్తులు తండోపతండాలుగా తరలి వచ్చి అమ్మవారిని తరించనున్నారు.





పలువురు ప్రముఖులు, రాజకీయ వేత్తలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని నందమూరి నగర్‌లో చేపడుతున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులను ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌యంసి ఏఈ రాజీవ్, బీఆర్‌యస్ పార్టీ డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్ పాల్గొన్నారు.



వరదనీటి కాల్వ నిర్మాణ పనులను పరిశీలించిన కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

కొత్త విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలి

మోతీనగర్: మోతీనగర్, అవంతినగర్, పీఆర్‌నగర్ ప్రాంతాల్లో పాత ఎలక్ట్రికల్ పోల్స్‌ను మార్చి వెంటనే నూతన పోల్స్‌ను ఏర్పాటు చేయాలని మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ అధికారులకు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతకొన్ని సంవత్సరాలుగా పాత ఎలక్ట్రికల్ పోల్స్ ఏర్పాటు చేయటంతో వర్షాకాలంలో ఎప్పుడు క్రింద పడతాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. గాలులకు వైర్లు కూడా దగ్గర కావటంతో విద్యుత్ సమస్య ఏర్పడుతోందన్నారు. వీలైనంత త్వరగా పాత ఎలక్ట్రికల్ పోల్స్ స్థానంలో కొత్త పోల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అవంతినగర్ కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఈస్ట్ కాలనీ అధ్యక్షుడు కోటిరెడ్డి, పీఆర్‌నగర్ వీకర్ సెక్షన్ అధ్యక్షుడు రవి కుమార్, బీజేపీ నాయకులు నాగరాజు, రమేష్ నాయుడు, ఎర్ర స్వామి, శోభ రాజన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ పోల్స్‌ను పరిశీలించిన కార్పొరేటర్ మహేందర్ తదితరులు

నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులైనా వెచ్చిస్తా

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టేందుకు వెనుకాడేది లేదని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ నల్లగుట్టలో రూ.93 లక్షలతో వీడీసీసీ రోడ్డు, బేగంపేట డివిజన్‌లోని ఓల్డ్ పాటిగడ్డలో రూ.12.40 లక్షలతో వీడీసీసీ రోడ్డు, ఎయిర్‌లైన్స్ కాలనీలో రూ.14 లక్షలతో చేపట్టనున్న ఫుట్‌పాత్ పనులను శనివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గతంలో నల్లకుంట ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో రహదారులు మొత్తం మురికిమయంగా ఉండేవని, ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లు తేడా లేకుండా సీవరేజీ పైప్‌లైన్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించామన్నారు. నూతనంగా నిర్మించే వీడీసీసీ రోడ్డుతో ఈ ప్రాంతంలోని సమస్యలు దాదాపుగా పరిష్కారమైనట్లే అన్నారు. తమ బస్తీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులు మంత్రిని కోరగా త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఓల్డ్‌పాటిగడ్డలో మల్టీపర్పస్ హాల్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

బోనాల ఏర్పాట్లు పూర్తి



మూసాపేటలో బోనాలకు సిద్ధమైన చిత్తారమ్మ అమ్మవారి దేవాలయం

మూసాపేట: మూసాపేటలోని చిత్తారమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాస బోనాల ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ తూము శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దర్శనానికి ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం అమ్మవారి అలంకరణ, దర్శనం, బోనాల సమర్పణ, ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

పాఠశాలల సమస్యలను పరిష్కరించాలి



ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకుంటున్న గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, ఎన్ఎస్‌యుఐ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జడ్పీ హైస్కూలులో విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో వంటలను పరిశీలించారు. పాఠశాలలో మంచినీరు, టాయిలెట్లు, పరిసరాలు శుభ్రంగా లేకపోవటం వంటి సమస్యలను స్వయంగా పరిశీలించారు. వంట మనుషులకు సమయానికి వేతనాలు అందటం లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌యస్ ప్రభుత్వం ఈ విధంగా సర్కారు పాఠశాలల్లో సమస్యలను గాలికొదిలేసిందని అన్నారు. ప్రజా ప్రతినిదులు పాఠశాలలోని సమస్యలను పట్టించుకోవటం లేదన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణం పాఠశాలల్లో తనిఖీ చేపట్టి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ స్టేట్ జనరల్ సెక్రటరి మిస్బాఉద్దీన్, ప్రెసిడెంట్ గణేష్, బి. బ్లాక్ అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్, మూసాపేట డివిజన్ వైస్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు నిఖిల్, సెక్రటరి వంశీ ముదిరాజ్, సాయితేజ, సాయి, అనిరుద్, నవీన్, ప్రణతి, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

తొట్టెల ఊరేగింపు

కూకట్‌పల్లి: ఆషాఢమాసంలో బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి దయార్‌గూడలో రామ్‌జీ సేత యూత్, బచ్చలి మధుల ఆధ్వర్యంలో తొట్టెల ఊరేగింపు జరిగింది. ఈ తొట్టెల ఊరేగింపులో కూకట్‌పల్లి బీఆర్‌యస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, బచ్చలి రాంచందర్, రవి, హరి, రాజేష్, రాకేష్, వినోద్, భానుచందర్, అఖిల్, రవి తదితరులు పాల్గొన్నారు.



మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు



తొట్టెల ఊరేగింపులో పాల్గొన్న బీఆర్ఎస్ నేత గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు

హైటెక్స్‌లో హైదరాబాద్ డెంటల్ షో

రెండు రోజుల పాటు వర్క్‌షాప్‌లు, సదస్సులు

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న హైదరాబాద్ డెంటల్ షో(హెచ్‌డిఎస్)ను ఉమెన్ సేఫ్టీ వింగ్, షీటీమ్స్, భరోసా ఏడీజీపి శిఖాగోయల్ శనివారం ప్రారంభించారు.ఇండియన్ డెంటల్ అసోసియేషన్ హెచ్‌ఓ అధ్యక్షుడు డాక్టర్ రాజీవ్ కె.చుగ్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించనున్న డెంటల్ షోలో దంత వైద్య నిపుణులు హాజరుకానున్నట్టు తెలిపారు. సదస్సులో ప్రాక్టీషనర్లు, విద్యావేత్తలు, విద్యార్థులు, డెంటల్ ఎక్విప్‌మెంట్,మెటీరియల్,ల్యాబ్‌లు, తయారీదారులు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. ప్రదర్శనలో భాగంగా పాటలు, నృత్యం, ఫ్యాషన్ షో, యాడ్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఐడీఏహెచ్‌ఓ సెక్రటరీ జనరల్ డాక్టర్ అశోక్ ధోబ్లే, డబ్ల్యూడీసీ చైర్ పర్సన్ డాక్టర్ అనుగిరిధర్, డబ్ల్యూడీసీ సెక్రటరీ డాక్టర్ మనీషా గరుడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి: అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాల్లో కూడా దేశంలో అగ్ర రాష్ట్రంగా తెలంగాణాని నిలపడం మనందరికి గర్వ కారణమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో బీసీ బంధు ద్వారా 40 మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు అండగా నిలుస్తూ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ వారికి ఆర్థిక చేయూతనందిస్తూ వారికి పెద్ద అన్నలాగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలుస్తున్నారని, ప్రతి కుటుంబానికి ఏదో సంక్షేమ పథకం అందించి వారికి అండగా నిలబడుతున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని దళిత బంధు, బీసీ బంధు, రైతు బంధు, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, రైతు బీమా 24 గంటల విద్యుత్ వంటి అనేక పథకాలతో తెలంగాణ రాష్ట్రం నేడు పచ్చని పాడి పంటలతో కళకళలాడుతోందన్నారు. తెలంగాణ కోటి రతనాల వీణ అన్న నినాదం దేశ వ్యాప్తంగా వినబడేటట్లు చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు మందడి శ్రీనివాసరావు, సబిహా బేగం, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ...

బాలాజీనగర్ డివిజన్ ధనలక్ష్మీ సెంటర్ కమ్యూనిటి హాలులో జరుగుతున్న ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సందర్శించారు.

పార్కుల పరిశీలన.....

కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్‌లలోని పలు పార్కులను శనివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. బాలాజీనగర్‌లోని ఎల్ఐజి ఫ్రీడమ్ పార్కు, ధనలక్ష్మీ గ్రౌండ్‌లనుపరిశీలించి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్‌లు పగుడాల శిరీష బాబూరావు, మందడి శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రభాకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



బీసీ బంధు పథకం లబ్ధిదారునికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



పార్కులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తదితరులు

బైక్‌ను ఢీకొట్టిన కంటెయినర్

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులో ఘటన

నార్కట్‌పల్లి: బైక్‌పై వెళ్తున్న యువకులను వెనుక నుంచి కంటెయినర్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ సైదాబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన గుంటి మనోజ్, హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన కొనగంటి మధుకిరణ్(20) నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడ సమీపంలో గల మహాత్మాగాంధీ యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. ఇరువురు కలిసి శనివారం నార్కట్‌పల్లి నుంచి యూనివర్సిటీ వైపు బైక్‌పై వెళ్తుండగా అద్దంకి-నార్కట్‌పల్లి రోడ్డులో నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులో వెనుక నుంచి కంటెయినర్ లారీ వచ్చి ఢీకొట్టింది. దీంతో మధుకిరణ్ రోడ్డుపై పడిపోగా కంటెయినర్ అతడి మీద నుంచి వెళ్లడంతో అక్కడిక్కక్కడే మృతిచెందాడు. మనోజ్ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మధుకిరణ్ మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి, గాయపడిన మనోజ్‌ను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు.